క్లుప్తంగా

పేదలకు వరం 'సీఎం రిలీఫ్ ఫండ్'



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పరిగి: మండలంలోని బోరెడ్డిపల్లికి చెందిన హనుమంతుడు అనే వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కును ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ శనివారం అందజేశారు. హనుమంతుడు వెన్నుముక అరుగుదలతో కూడిన అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఎమ్మెల్యే చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా ఇటీవలే రూ.28 వేల చెక్కు మంజూరైంది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, ఎంపీటీసీలు చంద్రారెడ్డి, రామాంజి, మారుతీరెడ్డి, శివశంకర్, రఘు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

గోరంట్ల: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు డిసెంబర్ 15వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్ర మెగా టోర్నమెంట్ నిర్వహిస్తామని ఎంపీడీఓ రఘునాథగుప్తా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాల వయస్సు పైబడిన క్రీడాకారులు ఈనెల 27వ తేదీ నుంచి ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఆస్పత్రిని ప్రారంభించిన పుట్టపర్తి ఎమ్మెల్యే



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

గోరంట్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో అరోమా హెల్త్ కేర్ ఆస్పత్రిని శనివారం సాయంత్రం పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ఆస్పత్రిలో కంటి పరీక్షలతో పాటు చెవి, ముక్కు, గొంతు, దంత పరీక్షల విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బొగ్గు సురేష్ మాట్లాడుతూ.. ఇది వరకే పుట్టపర్తి, హైదరాబాద్‌లో అరోమా హెల్త్ కేర్ ఆస్పత్రులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్. డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ నందన్‌రెడ్డి, డాక్టర్ యువరాజ్, డాక్టర్ రాంబాబు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈడిగలు అన్ని రంగాల్లో రాణించాలి



పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఈడిగ సంఘం నాయకులు

హిందూపురం టౌన్: ఈడిగ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఈడిగ ప్యాలెస్‌లో ఆర్య ఈడిగ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా రామకృష్ణప్ప, వెంకటనారాయణ, దేవేంద్రప్ప, పుల్లారెడ్డి, మల్లికార్జున గౌడ్, నారాయణస్వామి, అధ్యక్షుడిగా శేఖర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా కిరణ్‌కుమార్ గౌడ్, గురు ప్రతాప్, కార్యదర్శిగా వినయ్, జాయింట్ సెక్రటరీగా తిరుమలేష్, ప్రచార కార్యకర్తగా లక్ష్మీపతిగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈడిగ సంఘం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఐదుగురు పేద విద్యార్థుల చదువులకు రూ.2.50 లక్షల ఆర్థికసాయం అందజేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న వాల్మీకులు

పావగడ: తాలూకాలోని బుగుడూరు గ్రామంలో వాల్మీకి యువకుల సంఘం ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహాన్ని గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించారు. వాల్మీకి సంఘం నాయకులు, కులస్తులు వాల్మీకి విగ్రహానికి పూజలు చేపట్టారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు జ్యోతులు మోశారు. కార్యక్రమంలో వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు పాళేగార్ లోకేష్, ఉపాధ్యక్షుడు భాస్కరనాయక, కామయ్య, రాము, నారాయణ, రమేష్, రామలక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల సాకారం

- రూ.2 కోట్లతో బ్రిడ్జి, తారురోడ్డు నిర్మాణం
- చొరవ తీసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ
- నాలుగు దశాబ్దాల సమస్య పరిష్కారం





నారనాగేపల్లి నుంచి కొత్తపల్లి క్రాస్ వరకూ నిర్మించిన తారు రోడ్డు (ఇన్‌సెట్‌లో) పెన్నానదిపై నిర్మించిన బ్రిడ్జి

రొద్దం: గత 40 సంవత్సరాలుగా మండల పరిధిలోని రొద్దం నుంచి గౌరాజుపల్లి మీదుగా నారనాగేపల్లి గ్రామానికి వెళ్లే పెన్నానదిపై బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాలు వచ్చి పెన్నానది ప్రవహిస్తే నెలల తరబడి బయట గ్రామాలతో సంబంధాలు ఉండేకావు. ఎం.కొత్తపల్లి, గౌరాజుపల్లి, రాచూరు, జక్కలచెరువు మీదుగా పావగడకు రాకపోకలకు ఇబ్బందిగా మారేంది. స్కూళ్లు, కాలేజీలకు విద్యార్థులు వెళ్లాలంటే తీవ్ర అవస్థలు పడ్డారు. గ్రామానికి 108 వాహనం కూడా రాలేని పరిస్థితి. గత టీడీపీ ప్రభుత్వంలో ఎంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసినా ఫలితం లేకుండా పోయింది. రహదారి నిర్మాణం కాదు కదా తాత్కాలిక మర్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే శంకరనారాయణ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి చొరవ తీసుకున్నారు. ఇందు కోసం ఆరు నెలల క్రితం రూ.25 కోట్ల నిధులు మంజూరు చేయించారు. పెన్నానదిపై కాజ్‌వే బ్రిడ్జి, గ్రామంలో సిమెంట్ రోడ్డు, ఎం కొత్తపల్లి క్రాస్ వరకూ తారురోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. భూమి పూజ చేసిన ఆరు నెలలకే సంబంధిత అధికారుల పర్యవేక్షణలో బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేశారు. 40 ఏళ్ల బ్రిడ్జి, రహదారి కల నెరవేరడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కారం



నారనాగేపల్లి నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడేవాళ్లం. రోడ్డు మొత్తం మోకాలిలోతు గుంతలు ఏర్పడి నడవడానికి వీలు లేకుండా మారింది. పెన్నానది ప్రవహిస్తే బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండేది కాదు. ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలకు రావాలంటే పడిలేస్తూ వచ్చిన సంఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో మా సమస్యను ఎమ్మెల్యే శంకరన్న దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన ఎమ్మెల్యే బ్రిడ్జి, రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది. పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం అవుతుందని కలలో కూడా ఊహించలేదు.

– నాగార్జున, సర్పంచ్, నారనాగేపల్లి

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాలకు వెళ్లాలంటే అంతర్గత రహదారి గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు పడ్డాం. గత 40 ఏళ్లుగా నరకయాతన అనుభవించాం. నిత్యం రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగేవి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే శంకరనారాయణ కృషితో మాకు రహదారి నిర్మాణం జరిగింది. ఆయనకు గ్రామస్తులు జీవితాంతం రుణపడి ఉంటారు.

– జి.సత్యనారాయణ నారనాగేపల్లి

మరోసారి జగన్‌ను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



ఎమ్మెల్యే తిప్పేస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో గ్రామాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి చెందకచెర్లు గ్రామంలో పర్యటించారు. అనంతరం వారితో సమావేశమై గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ ఇంటింటా సర్వే, ప్రజా సమస్యలు, తాగునీరు, అభివృద్ధి పనులపై చర్చించారు. గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించాలని సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ సర్వే నిర్వహించాలని కోరారు. గ్రామ సచివాలయాల పరిధిలో రూ.20 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే 8 గ్రామాల్లో కొత్తగా బోర్లు వేయించామన్నారు. గ్రామస్థాయిలో పరిష్కరం కాని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభావతిబాయి, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, మాజీ ఎంపీపీ బజ్జప్ప, వివిధ కమిటీ సభ్యులు దివాకర్, జయరాజ్, యంజారప్ప, నాగభూషణరెడ్డి, శివప్ప, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది, టీడీపల్లి గ్రామాల్లో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. గృహసారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ బుక్‌లెట్ అందించారు. మరోసారి మీ దీవెనలు అందించి మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్ జగన్‌కే తమ సంపూర్ణ మద్దతు అందిస్తామని ప్రజలు తెలిపారు.

రొళ్ల: గ్రామాల్లో ప్రతి పేద కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పథకాలు అందించిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర, ఎంపీటీసీ లింగరాజు తదితరులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని గుడ్డగురికి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు తిరిగి అందాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. ప్రజలు వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గోవిందరాజు, అశ్వత్థరెడ్డి పాల్గొన్నారు



మడకశిర మండలం ఆమిదాలగొందిలో బుక్‌లెట్ అందిస్తున్న నాయకులు



రొళ్ల మండలం గుడ్డగురికిలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉన్నతస్థాయికి చేరుకోండి



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

పావగడ: విద్యార్థులు చక్కగా చదువుకుని, ఉన్నతస్థాయికి చేరుకోవాలని స్థానిక క్రెడల్ మాజీ డైరెక్టర్ జీవీ బలరాం సూచించారు. స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో పావగడ తాలూకా క్షేమాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే 2 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని అందించే అతి పెద్ద సోలార్ పార్క్ నెలకొన్న పావగడ వైపు ప్రపంచమంతా చూస్తోందన్నారు. మరో 15 వేల ఎకరాల్లో అదనంగా 2 వేల మెగావాట్ల సౌర విద్యుత్ అందించే సోలార్ పార్క్‌ను త్వరలోనే నిర్మిస్తామన్నారు. అనంతరం పది, పీయూ, డిగ్రీ, మెడిసిన్, ఇంజినీరింగ్ కోర్సుల్లో ఉత్తమ మార్కులు సాధించిన 40 మంది విద్యార్థులకు పురస్కారాలు, స్కాలర్‌షిప్స్ అందజేశారు. అలాగే 10 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో బీఈఓ ఇంద్రాణమ్మ, సంస్థ పదాధికారులు ఆర్‌పీ సాంబ సదాశివరెడ్డి, బీఏ వెంకటేశులు, కృష్ణప్ప, దాసణ్ణ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ



కోవెల

అమరాపురం: హలుకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కోవెల ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అనంతపురంలో జరిగిన అండర్–14 అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటింది. మూడో స్థానంలో నిలిచిన విద్యార్థిని కోవెలను శనివారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, పీడీ, పీఈటీతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

హెచ్ఐవీపై అవగాహన

లేపాక్షి: మండల కేంద్రంలోని సచివాలయంలో శనివారం సర్పంచ్ ఆదినారాయణ అధ్యక్షతన హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైతన్య రూరల్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో హెచ్ఐవీ వల్ల కలిగే అనర్థాలు, ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శివారెడ్డి, ఎంపీడీఓ నరసింహనాయుడు, చైతన్య గంగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, చైతన్య సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

లేపాక్షి: మండలంలోని సోమిరెడ్డిపల్లి క్రాస్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ గోపి తెలిపారు. శనివారం ఉదయం మండలంలోని గొంగటిపల్లి గ్రామానికి చెందిన బి.సోమశేఖర్ అక్రమంగా కర్ణాటక మద్యం తరలించి విక్రయిస్తున్నట్లు సమాచారం అందినట్లు పేర్కొన్నారు. సోమిరెడ్డిపల్లి క్రాస్ వద్ద తనిఖీలు చేపట్టగా బి.సోమశేఖర్ సంచిలో మద్యం ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడి నుంచి 85 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

హిందూపురం: ప్రజలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ అన్నారు. శనివారం స్థానిక సీనియర్ సిటిజన్ కోర్టు ఆవరణలో జాతీయ న్యాయ దినోత్సవం, వరకట్న నిషేధ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలన్నారు. వరకట్న దురాచారాన్ని రూపుమాపాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్, ఏపీపీ ఇందాద్, ఏజీపీ శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు నారాయణ గౌడ్, సుదర్శన్, సిద్ధూ, కృష్ణమూర్తి, రవికుమార్, నవేరా, పార్వతి, లోక్ అదాలత్ శారద, హేమావతి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భక్తిశ్రద్ధలతో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

సోమందేపల్లి: మండలంలోని పోలేపల్లి గ్రామంలో శనివారం ఆంజనేయ స్వామి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలేపల్లి నర్సింహులు, రాంమోహన్ రెడ్డి, కొల్లప్ప, శంకర్ రెడ్డి, బాబు, మురళి, మంజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు

మడకశిర: పేదల కోసమే ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పావగడకు చెందిన జపానందస్వామి తెలిపారు. శనివారం పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో శారదాదేవి కంటి ఆస్పత్రి, పరిశోధన సంస్థ, స్వామి వివేకానంద సంఘటిత గ్రామాంతర ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జపానంద స్వామి మాట్లాడుతూ.. ఈ శిబిరంలో ఎంపికైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు ఎస్ రఘువీరా రెడ్డి మాట్లాడుతూ.. జపానందస్వామి పేదల కోసం సామాజిక కార్యక్రమాలను మడకశిర ప్రాంతంలో నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ రవిశంకర్, మంజునాథ్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

సోమందేపల్లి: స్థానిక కొత్తపల్లి క్రాస్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. శనివారం ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

హిందూపురం/గుడిబండ/మడకశిరరూరల్/పావగడ/అగళి/రొళ్ల: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శనివారం శని త్రయోదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆయా మండలాల్లోని శనేశ్వర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో సందడి నెలకొంది. ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం చేశారు. భక్తులు నువ్వుల నూనె దీపాలను భక్తిశ్రద్ధలతో వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయాల వద్ద అన్నదానం చేశారు.



పావగడలో శనీశ్వరస్వామికి పూజలు





హిందూపురం: విశేష అలంకరణలో శనీశ్వర స్వామి, రొళ్ల మండలం జీఎన్ పాళ్యంలో అన్నదానం

కనకదాస విగ్రహ ఊరేగింపు

రొద్దం: భక్త కనకదాస నూతన రాత్రి విగ్రహాన్ని శనివారం మండల కేంద్రంలోని సచివాలయం నుంచి ప్రధాన వీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. త్వరలో చిన్న అంజనేయస్వామి దేవాలయం ఎదుట కనకదాస విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని కురుబ సంఘం నాయకులు తెలిపారు.

ఘనంగా వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవం



హ్యారిక్రోబక్ చిత్రపటానికి నివాళులర్పించిన వ్యాయామ ఉపాధ్యాయులు

లేపాక్షి: మండల పరిధిలోని కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. వ్యాయామ విద్యా పితామహుడు హ్యారిక్రోబక్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ.. 1920లో వైఎంసీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను మద్రాస్‌లో స్థాపించడం జరిగిందన్నారు. భారతదేశంలో క్రీడల అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు హ్యారిక్రోబక్ అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేషగిరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెంపేగౌడను ఆదర్శంగా తీసుకుందాం



ఆలదపల్లిలో కలశాలను మోస్తున్న మహిళలు

అమరాపురం: బెంగళూరు బస్తాండు నిర్మాత కెంపేగౌడను ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని అన్నారు. శనివారం మండలంలోని ఆలదపల్లిలో కుంచిటి వక్కలిగుల ఆధ్వర్యంలో కెంపేగౌడ జయంతి జరుపుకున్నారు. మహిళలు కలశాలతో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కెంపేగౌడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుంచిటి వక్కలిగలు ఐకమత్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని మడకశిర నియోజకవర్గం కుంచిటి వక్కలిగుల అధ్యక్షుడు, రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, కార్పొరేషన్ డైరెక్టర్లు పిలుపునిచ్చారు. ముఖ్య అతిథులను స్థానిక కెంపేగౌడ సంఘం వారు సన్మానించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా కన్వీనర్‌గా హరి

హిందూపురం టౌన్: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా కన్వీనర్‌గా మేడికుర్తి హరి నియమితులయ్యారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అర్హత ఉండి కూడా పథకాలు పొందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ యాత్ర నవంబర్ 26 నుంచి జనవరి 26 వరకూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జరుగుతుందన్నారు.

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు

మడకశిరరూరల్: మండలంలోని ఏఆర్ రొప్పం, దిగువ రామగిరి గ్రామాల్లో రూ.12 లక్షలతో డ్రైనేజీల నిర్మాణానికి శనివారం అధికారులు, గ్రామ ప్రజలతో కలిసి సర్పంచ్ గీత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఏఆర్ రొప్పంలో రూ.9 లక్షలతో, దిగువ రామగిరిలో రూ.3 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టామన్నారు. మిగిలిన నిధులను మోటారు, తాగునీటి పైపులైన్ పనులకు ఖర్చు చేస్తామని పేర్కొన్నారు.

జంక్ ఫుడ్‌తో అనర్థాలు

పరిగి: మండలంలోని సేవామందిరం ఏఎం లింగణ్ణ మెమోరియల్ స్కూల్‌లో శనివారం జంక్ ఫుడ్ అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ సెక్రెటరీ కేటీ సరిత ఆధ్వర్యంలో మంచి ఆహారపు అలవాట్లు, చెడు తినుబండారాల వల్ల కలిగే అనర్థాలను డాక్టర్ కేశవులు, డాక్టర్ శ్రీక్రాంతి వివరించారు. అనంతరం వక్తృత్వ, ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించారు. సంస్థ కరస్పాండెంట్ కేటీ శ్రీధర్ పాల్గొన్నారు.

మహిళలను గౌరవిద్దాం



లేపాక్షిలో మాట్లాడుతున్న ఆర్డీటీ ఉరవకొండ రీజినల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి



రొళ్లలో మాట్లాడుతున్న ఆర్డీటీ ట్రాన్స్‌పోర్ట్ డైరెక్టర్ నిర్మల్ కుమార్

మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో శనివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మడకశిర, అమరాపురం, గుడిబండ, లేపాక్షి, గోరంట్ల, రొళ్ల మండల కేంద్రాల్లో ప్లకార్డులతో మహిళలు భారీ ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ల వద్ద మానవహారంగా ఏర్పడి మహిళలను కాపాడుకోవాలని నినాదాలు చేశారు. ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో బాల్య వివాహాలను నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆర్డీటీ ఉరవకొండ రీజినల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరూ కూడా మహిళలను గౌరవించినప్పుడే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఆర్డీటీ ట్రాన్స్ పోర్ట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. – సాక్షినెట్‌వర్క్:



గుడిబండలో..



అమరాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు